క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం



తొర్రూరు రూరల్: పేద విద్యార్థుల ఆరోగ్యమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాటేడు ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ వల్లపు శోభ, ఎంపీటీసీ దీకొండ కవిత, హెచ్ఎం ప్రభాకర్, సీడీపీఓ హైమావతి, సూపర్‌వైజర్ జలగం సునీత పీఏసీఎస్ డైరెక్టర్ జనార్దన్ రాజు, ఉపసర్పంచ్ పినాకపాణి పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ చేయూత



కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) జెడ్పీ హైస్కూల్‌ను అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ యానాల రజనీకుమార్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని సదుపాయాలను తెలుసుకున్నారు. వెంటనే తక్షణ సాయంగా రూ.50వేలను హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు హెచ్‌ఎం ఇస్లావత్ లచ్చిరాంనాయక్ వెంకన్న పాల్గొన్నారు.

వేతనం విడుదల చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహించిన వీఓఏలకు సమ్మెకాలంతో కూడిన వేతనాన్ని విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. సమావేశంలో ఐకేపీ వీఓఏ యూనియన్ జిల్లా నాయకులు మౌనిక, శోభారాణి, కృష్ణవేణి, దార శ్రీలత, వసంత, వినోద పాల్గొన్నారు.

9న బహిరంగ సభ



పెద్దవంగర: తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఈ నెల 9న జరిగే మంత్రి కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ ఇన్‌చార్జ్‌లతో సమావేశం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, సోమనర్సింహరెడ్డి, పాల్గొన్నారు.

వచ్చేది బహుజన రాజ్యమే

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బహుజన రాజ్యం పక్కాగా వస్తుందని అసెంబ్లీ ఇన్‌చార్జ్ శివరాజ్ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బైక్ ర్యాలీ నిర్వహించి అసెంబ్లీ కార్యాలయం ప్రారంభించి కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, విజయ్‌కాంత్, దార ప్రసాద్ రావు, ఉపేందర్, ఐతం ఉపేందర్, లక్ష్మణ్, నరేష్, చాణిక్య, శ్రీను పాల్గొన్నారు.

15శాతం భృతి ఇవ్వాలి

మహబూబాబాద్: 15శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య డిమాండ్ చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో రమణయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, రాములు, చంద్రయ్య, దయాకర్, జనార్దన్ పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో నలుగురికి కొలువులు

- కానిస్టేబుల్‌గా ముగ్గిరి ఎంపిక.. ఒకరు ఏఈఓ



మహేష్ శివకుమార్ భార్గవి నవనీత

బయ్యారం: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలోని చింతోనిగుంపు గ్రామానికి చెందిన గొర్రెలకాపరి వంగ సోమనర్సయ్య ఇంట్లో నలుగురు కొలువులు సాధించారు. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ముగ్గురు ఎంపిక కాగా.. ఇప్పటికే ఒకరు ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమనర్సయ్య–మల్లమ్మ దంపతులు గొర్రెలను పోషించుకుంటూ ఇద్దరు కుమారులు మహేశ్, శివకుమార్‌ను బీటెక్ చదివించారు. ఇద్దరికి వివాహం చేశారు. కాగా మహేశ్ భార్య నవనీత రెండేళ్ల క్రితం ఏఈఓ ఉద్యోగం సాధించింది. ఇదిలా ఉండగా మహేశ్‌తో పాటు శివకుమార్ భార్య భార్గవి ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నారు. ఈ ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబర్చి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఒకే ఇంట్లో నలుగురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై సోమనర్సయ్య–మల్లమ్మ దంపతులతో పాటు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఓటేసి గెలిపించిన ఊరిని మర్చిపోను

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

చిన్నగూడూరు: ఓటు వేసి గెలిపించిన ఊరిని మర్చిపోనని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గుండంరాజుపల్లి, ఉగ్గంపల్లి గ్రామాల్లో పర్యటించి రూ.9 కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి రాగానే గుండంరాజుపల్లి నుంచి చిన్నగూడూరు మధ్య జిన్నెల వాగుపై బ్రిడ్జి నిర్మించే బాధ్యత తనదేనన్నారు. అనంతరం ఉగ్గంపల్లిలో యువతకు టీషర్ట్‌లు, క్రీడా వస్తువులు, బతుకమ్మ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ మూల సునీత, మైనార్టీ జిల్లా నాయకులు ఆయూబ్ పాషా, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, కొమిరెల్లి, మల్లేశం, మండల అధ్యక్షుడు రాంసింగ్, మంగపతిరావు, సర్పంచ్‌లు పూలమ్మ, సలీమా, ఎంపీటీసీలు ఉదయమ్మ, మమత పాల్గొన్నారు.



డోర్నకల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

అభివృద్ధిని విస్తృత ప్రచారం చేయాలి

డోర్నకల్: సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్ర అభివృద్ధి, తన హయాంలో నియోజకవర్గ అభివృద్ధిని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కోరారు. మండలంలోని మోదుగగడ్డతండా సమీపంలోని ఆకేరువాగుపై రూ.20కోట్ల నిధులతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. మన్నెగూడెం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో రూ.56లక్షలతో నిర్మించిన గోదాంను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి సీతారామిరెడ్డి, వైస్ చైర్మన్ మన్మధరావు, ఎంపీపీ బాలునాయక్, సర్పంచులు రాధిక, రమేష్, ఎంపీటీసీ సభ్యులు విజయపాల్‌రెడ్డి, నీలా, నాయకులు రామనాథం పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ప్రారంభం

డోర్నకల్ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫైర్‌స్టేషన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన 18ఫైర్‌స్టేషన్లను వర్చువల్‌గా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రారంభించగా ఎమ్మెల్యే నేరుగా ఫైర్‌స్టేషన్ భవనంతోపాటు ఫైర్ వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కమిషనర్ మున్వర్ అలీ, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ చలపతిరావు, ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, ఫైర్ స్టేషన్ సీఐ నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

గూడూరు: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందని, ప్రజలు అందుకు మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని మచ్చర్ల గ్రామంలో శుక్రవారం రూ.20లక్షలతో సీసీరోడ్డు, అంగన్‌వాడీ భవన మరమ్మతు, ప్రహరీ, బందెలదొడ్డి పనులతోపాటు రెండు పడకల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. యవకులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, గృహలక్ష్మి పట్టాలను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ పాలనకు అడ్డులేదన్నారు. ఎవరెన్ని రకాలుగా ప్రజలను మభ్యపెట్టినా, లబ్ధిపొందిన ప్రజలు పట్టం కడతారన్నారు. రాబోయో ఎన్నికల ముందు ఇంకా అవసరమైన పథకాలను వరంగల్‌లో జరిగే సభలో సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని, ఇక బీఆర్‌ఎస్‌కు ఎదురు ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనెం మణిచందన, ఎంపీటీసీ ప్రసూన, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటక్రిష్టారెడ్డి, జలగం సంపత్‌రావు, జెడ్పీ కోఆప్షన్ ఎండి. ఖాసీం, ఎంపీడీఓ రోజారాణి పాల్గొన్నారు.



మచ్చర్లలో డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి తోడ్పడాలి

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్ సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 6వ, 9వ తరగతులకు నిర్వహిస్తున్న ఎస్ఈఏఎస్ అభ్యసన పత్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పరీక్షలను అదేవిధంగా నిర్వహించాలని సూచించారు. హెచ్ఎం సంకా బద్రినారాయణ, ఉపాధ్యాయులు స్నేహలత, సుజాత, సౌభాగ్య, దుర్గయ్య, నాగరాణి, ప్రవీణ్ పాల్గొన్నారు.



పరీక్షలను పరిశీలిస్తున్న ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్

చెవిలో పూలతో నిరసన



కురవి: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని చేతిలో ప్లేట్లు పట్టుకుని శుక్రవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, లక్ష్మీ, రాధిక, సువర్ణ, గోపమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లో చేపట్టిన దీక్షలో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు చెవిలో పూలు, ప్లేట్లతో నిరసన తెలిపారు. దీక్షకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కవిత, సీఐటీయూ నాయకులు సరోజ, సంధ్యాకుమారి మద్దతు తెలిపారు.

గార్ల: మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్, కట్టెబోయిన శ్రీనివాసరావు, సక్రు సంఘీభావం ప్రకటించారు.

కఠినంగా శిక్షించాలి

డోర్నకల్/గార్ల: బాలికపై అత్యాచారయత్నం చేసిన న్యాయవాది రమేష్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, శ్రీనివాసరావు, రాంబాబు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కవిత, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు, సత్యవతి, సుజాత, పద్మ, రామకృష్ణ, హరికృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అటవీ భూముల్లో పోడు చేస్తే చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ

నెల్లికుదురు: ఫారెస్టు భూముల్లో కొత్తగా ఎవరైన పోడు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ మంగిలాల్ నాయక్ తెలిపారు. మండలంలోని చిన్ననాగారం మీఠ్యతండా శివారులో ట్రెంచ్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ.. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతులకు పంపిణీ చేసిన పోడు పట్టాల విషయం తెలిసిందే. రైతులు వారి హద్దులను దాటి ఫారెస్టు భూములను ఆక్రమించినా, ట్రెంచ్ పనులను అడ్డుకున్నా పట్టాలు రద్దు చేయడమే కాకుండా చర్యలు తప్పవన్నారు. చిన్ననాగారం బీట్‌లోని 1139 కంపార్ట్‌మెంట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేసిన ట్రెంచ్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ సక్రాం నాయక్, ఎఫ్ఎస్ఓ శివకుమార్, బీట్ అధికారులు రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

మట్టి లారీలను అడ్డుకున్న రైతులు



రాస్తారోకో చేస్తున్న రైతులు, గ్రామస్తులు

కేసముద్రం: నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలిస్తున్నారంటూ, ఆగ్రహించిన రైతులు, గ్రామస్తులు టిప్పర్‌లను అడ్డుకున్న సంఘటన మండలంలోని కల్వల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామసమీపంలోని ఎర్రమట్టిబోడు నుంచి టిప్పర్‌లలో ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలిస్తుండడంతో, పలుచోట్ల తారురోడ్డు, సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. ఆగ్రహించిన కల్వల, ఇనుగుర్తి మండలం తారాసింగ్‌తండాజీపీకి చెందిన గ్రామస్తులు, రైతులు టిప్పర్‌లను అడ్డుకుని, రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా శ్రీను అనే వ్యక్తి, ఆందోళన చేస్తున్న తమను పట్టుకుని దుర్భాషలాడాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గంట బాలక్రిష్టారెడ్డి, గంట రామ్మోహన్‌రెడ్డి, పెరటి వెంకట్రాంనర్సయ్య, గండి శ్రీను, సోసైటీ డైరెక్టర్ శ్రీను, భద్రునాయక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులను మోసం చేస్తున్న కేంద్రం

మహబూబాబాద్ అర్బన్: కేంద్రంలో బీజేపీ అధికారం వచ్చినప్పటి నుంచి దళితులకు ఏడురకాల ద్రోహాలకు పాల్పడుతూ.. రాజ్యాంగం రద్దుకు కుట్రలు చేస్తుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని బేతుల్‌లో శుక్రవారం కేవీపీఎస్ సమావేశానికి ముందుగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జెండాను పాల్వాయి యాదగిరి ఎగరవేశారు. అనంతరం రామ్మూర్తి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు తొలగించడానికి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, కిరణ్, మహేందర్, ఎల్లయ్య, వెంకన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

‘దళితబంధు’ కోసం రాస్తారోకో

బయ్యారం: దళితబంధు పథకంను అందరికీ వర్తింపజేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని గంధంపల్లిలోని ఇల్లందు–మహబూబాబాద్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో ఎస్సై ఉపేందర్ ఆందోళన ప్రాంతానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపచేశారు. కార్యక్రమంలో దళితులు బాబురావు, బాలరాజు, సురేష్, ఉపేందర్, రాము, శ్రీను, భారతి, వెంకటమ్మ, కమలమ్మ, సుశీల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అర్హులకు అందించాలి

గూడూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని గ్రామాల్లో అర్హులైన వారికి అందించాలని దామరవంచకు చెందిన సంకినేని పద్మ, పత్తిపాక కొమ్మాలు, కందికట్ల శ్రీను, యాసారపు సంజీవ, నల్లగొండ అనిల్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. దామరవంచ గ్రామానికి మంజూరైన దళిత బంధు పథకంలో నాయకుల అవకతవకలకు పాల్పడి, అనర్హులను ఎంపిక చేశారన్నారు. వారిలో ముగ్గురు లబ్ధిదారుల భార్యలు అంగన్‌వాడీ ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం దామరవంచలో దళిత బంధు లబ్ధిదారుల లిస్టును పరిశీలించి, అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ మండల పరిషత్ అధికారిణి రోజారాణికి వినతిపత్రం అందించారు.



బయ్యారం: రాస్తారోకో నిర్వహిస్తున్న దళితులు

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు రూరల్: మండలంలోని సోమారపుకుంట తండా కాంగ్రెస్ కమిటీని నియమించినట్లు మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాటోతు రవి శుక్రవారం తెలిపారు. సోమరపుకుంట గ్రామ అధ్యక్షుడిగా బానోతు సాగర్, ప్రధాన కార్యదర్శి బానోతు కృష్ణ, కార్యదర్శిగా వెంకన్న, ఉపాధ్యక్షుడిగా అనిల్, దేవేందర్, కోశాధికారిగా గణేష్, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, కృష్ణ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా శారద, కాంతమ్మ ఎన్నికయ్యారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

గంగారం: మండలంలోని ప్రధాన మూలమలుపుల వద్ద ఏర్పాటు చేసేందుకు రూ.75వేల విలువ 32 రేడియం స్టిక్కర్ గల సూచిక బోర్డులను కోదండ రామ సేవా సమితి సహకారంతో సీఐ ఫణిధర్‌కు అందించారు. శుక్రవారం సీఐ సేవా సమితి ఆధ్వర్యంలో మూలమలుపుల వద్ద ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మద్యంతాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో కొత్తగూడ, గంగారం ఎస్సైలు నగేష్, దిలీప్,, పోలీస్ సిబ్బంది, ట్రస్ట్ చైర్మన్ సైపా సురేష్, కమిటీ సభ్యులు రాజేష్, రవి, రామారావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రిన్సిపాల్‌గా పదోన్నతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎఫ్ఏసీగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు శుక్రవారం రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, ఏఓ శివజ్యోతి, అధ్యాపకులు యుగంధర్, వేణుగోపాల్, మల్లేశం, రత్నమాల, రాజేందర్, సుజిత్ రెడ్డి, నరహరి, రామ్‌రెడ్డి, హతి రామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధి

మహబూబాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలందరికి లబ్ధి చేకూరుతుందని జంగిలిగొండ సర్పంచ్ పంజాల యాకసాయిలు అన్నారు. మండలంలోని జంగిలిగొండ గ్రామంలో లబ్ధిదారులకు గృహలక్ష్మి అనుమతి పత్రాలు, బతుకమ్మ చీరలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కొముర్రెల్లి, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

కాల్వ మరమ్మతు పనులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల ఆయకట్టు నుంచి జమాండ్లపల్లి తాళ్లచెరువు వరకు కట్టు కాల్వ మరమ్మతు పనులను నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధుల నుంచి రూ.5లక్షల వ్యయంతో మరమ్మతు పనులు జరుగనున్నాయని నీటిపారుదల శాఖ డీఈ కిషోర్ అన్నారు. కార్యక్రమంలో బండి వెంకన్న, మందుల రఘు, మారగాని సురేష్, శనిగారపు కుమార్ పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ వైస్ చైర్మన్‌గా భాస్కర్‌రావు



గార్ల: ఆత్మ కమిటీ వైస్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన మందనపు భాస్కర్‌రావును నియమిస్తూ ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఉమేష్, సర్పంచ్ సక్రు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు సూత్రపు రాజు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దవంగర: మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని సౌజన్య అండర్–14 విభాగంలో ఖోఖో క్రీడలో ప్రతిభ చాటింది. శుక్రవారం విద్యార్థిని పాఠశాల హెచ్ఎం కళాధర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు రమేష్, సునీత, రవి కుమార్, శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అహ్మద్‌ఖాన్



నెహ్రూసెంటర్: తెలంగాణ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా జిల్లా కేంద్రానికి చెందిన అహ్మద్‌ఖాన్‌ను నియమిస్తున్నట్లు కమిటీ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ సలీం పాష శుక్రవారం తెలిపారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్, ఐకేపీ కార్యాలయానికి వెళ్లడానికి గుంత తీసి అధికారులు, ప్రజాప్రతినిధులు మరిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మందుల యాకూబ్ తెలిపారు. వెంటనే గుంతను పూడ్చి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని కోరారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



గంగారం: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తాత్కలిక మండల కమిటీని మండలంలోని కోమట్లగూడెం గ్రామ ఉన్నత పాఠశాల ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి మల్లెల సాంబయ్య అన్నారు. మండల అధ్యక్షుడిగా పెనక వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా పద్మ, మండల ఉపాధ్యక్షుడిగా భాస్కర్ ఖన్నా, కార్యదర్శిగా రమేష్ ఎంపికయ్యారు.

తహసీల్దార్‌కు వినతి

బయ్యారం: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు ఉద్యోగాల కోసం గత పాలకులు తీసుకొచ్చిన జీఓ ఎంఎస్ నంబర్ 3ను చట్టం చేసి అమలుచేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, సుధాకర్, సురేష్, జనార్ధన్, నరేష్, సాంబరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మరిపెడ రూరల్: పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా రైతు బంధు సభ్యులు జర్పుల కాలునాయక్ అన్నారు. మరిపెడ మండలం బాల్యతండ గ్రామ పంచాయతీ పరిధిలో గృహలక్ష్మీ పథకం కింద ఎంపికైన మహిళా లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను శుక్రవారం కాలునాయక్ పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కేసముద్రం: నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన ఉప్పలయ్య అనే రైతు మార్కెట్లో సరుకులను విక్రయించి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. కోరుకొండ క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. వెనుక కూర్చున్న హేమలత తలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో మానుకోట ఆస్పత్రికి తరలించారు. రైతుకు చెందిన రూ.12వేల నగదు, లక్ష రూపాయల తక్‌పట్టి బాధితుడి కుటుంబ సభ్యులకు పైలట్, ఈఎంటీ అందజేశారు.

పట్టణ మహిళా అధ్యక్షురాలిగా ప్రభురాణి

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ పట్టణ బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలిగా నర్సింగోజు ప్రభురాణి ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, ప్రధాన కార్యదర్శి తరాల వీరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఉక్కుపరిశ్రమ సాధ్యం



బయ్యారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించటం ద్వారానే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం సాధ్యమని భద్రాద్రి జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా శుక్రవారం బయ్యారంలో పార్టీ పథకాలపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటేశ్వర్లు, వెంకటరమణ, ఎంపీటీసీ సోమేష్, వార్డుసభ్యులు సత్తిరెడ్డి, సుమన్, కోటయ్య, సొసైటీ డైరెక్టర్లు మల్లయ్య, కేతమల్లు, కాంగ్రెస్ నాయకులు ముసలయ్య, నిర్మల, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, భద్రయ్య పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

కురవి: డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కిసాన్ పరివార్ అధినేత, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆశావహులు నునావత్ భూపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యాతండా వద్ద కిసాన్ పరివార్ ఫాంహౌజ్‌లో మండల ఇన్‌చార్జ్ గుగులోత్ భీమానాయక్ అధ్యక్షతన 56 బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గెలుపు కోసం బూత్ ఇన్‌చార్జ్‌లు ప్రచారం నిర్వహించాలన్నారు. డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీవైగిరి, పరశురాం, రంగన్నగౌడ్, బానోత్‌విష్ణునాయక్, గాంధీనాయక్, వెంకటరమణ, రాందాస్‌నాయక్, ధర్మానాయక్, వీరన్న, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపాల్‌నాయక్

కాంగ్రెస్‌పాలనతోనే అభివృద్ధి సాధ్యం

గూడూరు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం ఖాయమని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మానుకోట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తన భర్త మురళీనాయక్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టి వెంకన్నయాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుగౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కురవి: మండలంలోని సూదనపల్లి శివారు బీబీనాయక్ తండా నుంచి సీరోలు మండలం చింతపల్లి శివారు కుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ శ్రీను, బండి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ భూక్య బుజ్జిరవి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు నెహ్రూనాయక్, పార్వతిపాండునాయక్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

మిరపతోట ధ్వంసంపై ఫిర్యాదు

డోర్నకల్: తన మిరపతోటను ఉద్దేశ పూర్వకంగా ధ్వంసం చేసి నష్టం కలిగించారంటూ ఓ రైతు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని వెన్నారంకు చెందిన రాయల శ్యాంసుందర్ శుక్రవారం మాట్లాడుతూ.. తన సోదరుడు రాయల జలేందర్ శుక్రవారం జలేందర్‌తోపాటు అతడి భార్య ధనమ్మ మిరప మొక్కలను పీకి సుమారు రూ.2లక్షల మేర నష్టం కలిగించారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

‘అనర్హులకు దళితబంధు’

కేసముద్రం: కేసముద్రంస్టేషన్‌లో అనర్హులైన అధికార పార్టీ అనుచరులకు, దళారులకు మాత్రమే దళితబంధు ఇచ్చారని ఆరోపిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రవీందర్‌రావుకు కేసముద్రంస్టేషన్‌కి చెందిన శ్రీనివాస్, రాంచందర్, సాయిబాబా, రాజు ఫిర్యాదు చేశారు.